

టన్ను చీనీ రూ. 20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 309 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.13 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

37.2°/22.4°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత 'అనంత'



అనంతపురం సబ్ జూనియర్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్‌ఏ) అంతర జిల్లాల ఫుట్‌బాల్ బాలుర టోర్నమెంట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. విజయవాడలో ఈ నెల 29 నుంచి 30 వరకు సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా సాగింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా జట్లు రాణించి ఫైనల్ చేరాయి. అనంతపురం జట్టు 2–1తో ఏలూరు జిల్లాను, 6–0 తో కాకినాడ జట్టును ఓడించి గ్రూప్ నుంచి మొదటి స్థానంలో నిలిచింది. తిరుపతి జిల్లాపై 4–0 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్ చేరిన శ్రీసత్యసాయి జిల్లాపై 1–0 తేడాతో విజయం సాధించింది. ఏలూరు ఎంపీ, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ అనంతపురం జట్టుకు విన్నర్స్ ట్రోఫీ, శ్రీసత్యసాయి జట్టుకు రన్నర్స్ ట్రోఫీ అందజేశారు.

కౌలు రైతులకూ 'భరోసా'

- జిల్లాలో 615 మంది లబ్ధిదారులు



పుట్టపర్తి అర్బన్: ఆరుగాలం కష్టపడి అందరికీ అన్నం పెట్టే రైతు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా కౌలు రైతులకు సైతం 'వైఎస్సార్ రైతు భరోసా'తో ఆదుకునేందుకు సర్వం సిద్ధం చేశారు. కౌలు రైతులకు కార్డులు అందజేసి రుణాలు ఇవ్వక, సహాయం చేయక గత ప్రభుత్వాలు ఇబ్బందులకు గురి చేశాయి. అలాంటి వారి కష్టాలు తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ తన ప్రభుత్వంలో తగిన న్యాయం చేస్తున్నారు. భూములు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసే వారితో పాటు దేవదాయ శాఖకు చెందిన భూముల్లో సాగు చేసే రైతులను గుర్తించి ఇప్పటికే సీసీఆర్‌సీ కార్డులు అందజేశారు. వీరందరి ఖాతాల్లో మొదటి విడతగా గురువారం నగదు జమ చేయనున్నారు.

జిల్లాలో 615 మందికి లబ్ధి..

జిల్లాలో 615 మంది కౌలు రైతులను వలంటీర్లు గుర్తించారు. భూస్వాముల నుంచి భూమిని కౌలుకు తీసుకొని పంటల సాగు చేసే రైతులు 603 మంది, దేవదాయ భూములను కౌలు చేసే రైతులు 12 మంది ఉన్నారు. వీరందరికీ రూ.46,12,500 మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయనున్నారు. గురువారం కంప్యూటర్ బటన్ నొక్కి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిధులు విడుదల చేస్తారు.


భూ సర్వేపై నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సర్వేయర్ అండ్ ల్యాండ్ ఏడీ రామకృష్ణ

ధర్మవరం అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూముల సర్వేపై నిర్లక్ష్యం వహించరాదని జిల్లా సర్వేయర్ అండ్ ల్యాండ్ ఏడీ రామకృష్ణ, ఆర్డీఓ తిప్పేనాయక్ అన్నారు. స్థానిక ఆర్డీఓ సమావేశ భవనంలో బుధవారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, రీసర్వే డీటీలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 63 గ్రామాల్లో సర్వేను డిసెంబర్ 31వ లోపు పూర్తి చేయాలన్నారు. రాళ్ల నాటే ప్రక్రియ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ కతిజున్‌కుబ్రా, అధికారులు పాల్గొన్నారు.

4న గూగూడులో చక్కెర వేలం



నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు పీర్లకు చదివించిన చక్కెరను సెప్టెంబర్ నాలుగో తేదీన ఆలయ ప్రాంగణంలో వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శోభ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు వేల కిలోల చక్కెరను వేలం ద్వారా విక్రయిస్తామని, వేలంలో పాల్గొనదలచిన వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

మాట తప్పక.. కొత్త కానుక

పెన్షన్లు పెంచుకుంటూ పోతామన్న హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలబెట్టుకుంటున్నారు. ఖర్చుకు వెనకాడకుండా లబ్ధిదారుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారు. కేవలం వృద్ధులకు మాత్రమే కాకుండా.. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరుస్తున్నారు. ప్రభుత్వం తరపున పేదలకు అందిస్తున్న సాయం దేశంలో ఎక్కడా ఈ స్థాయిలో లేదు. రూ. 2,750 నుంచి పది వేల రూపాయల వరకూ పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశే కావడం గమనార్హం.

- రేపటి నుంచి పింఛన్ల పండుగ
- కొత్తగా 6,176 మందికి మంజూరు
- నాలుగేళ్లలో భారీగా పెరిగిన లబ్ధిదారులు
- పేదల విషయంలో ఖర్చుకు వెనకాడని సర్కారు

ఆగస్టులో పింఛన్ అందుకున్న వారు	2,61,340
సెప్టెంబర్‌లో అందుకోనున్న వారు	2,67,516
పెరిగిన పెన్షన్లు	6,176
నాలుగేళ్లలో పెరిగినవి	26,673



పుట్టపర్తి అర్బన్: జిల్లాలో కొత్తగా మరికొంతమంది పింఛన్ల జాబితాలో చేరారు. వారికి సంబంధించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు సైతం విడుదల చేసింది. శుక్రవారం నుంచి ఇంటింటికీ వెళ్లి కొత్త పెన్షన్‌దారులకు వలంటీర్లు నగదు పంపిణీ చేయనున్నారు.

టీడీపీ హయాంలో అవస్థలు మరువగలమా?

టీడీపీ హయాంలో పెన్షన్ పొందాలంటే అవస్థలు పడాల్సి వచ్చేది. అప్పట్లో పంచాయతీ కార్యాలయం వద్దనో, గ్రామంలోని టీడీపీ పెద్ద ఇంటి వద్దనో అధికారులు పింఛన్లు పంపిణీ చేసేవారు. పింఛన్ కోసం అక్కడికెళ్లిన వృద్ధులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉండేది. ఇక.. కొత్తగా పెన్షన్ మంజూరు కావాలంటే సరేసరి. జన్మభూమి కమిటీల చుట్టూ వారమో, నెలనో తిరిగితే, అదీ లంచం ముట్టజెబితే తప్ప మంజూరు చేయని పరిస్థితి.

ఠంచన్‌గా ఇంటికే పింఛన్..

చెప్పాడంటే చేస్తాడంతే అన్నట్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏడాదికి రెండు సార్లు పింఛన్ల సంఖ్య పెంచుకుంటూ పోతున్నారు. టీడీపీ హయాంలో పెన్షన్ పొందేవారి బాధలు ప్రత్యక్షంగా చూసిన వైఎస్ జగన్.. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పెన్షన్‌దారులు కష్టం కలిగించకుండా ఇంటి వద్దనే డబ్బు అందించాలనే లక్ష్యంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. ప్రతి 50 ఇళ్లకూ వలంటీర్‌ను నియమించి నెలా తెల్లవారుజామునుంచే పింఛన్ మొత్తాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లి అందించేలా చర్యలు తీసుకున్నారు. లబ్ధిదారులు పొలాల్లో ఉన్నా, ఆసుపత్రుల్లో ఉన్నా, చికిత్స అనంతరం ఎక్కడ విశ్రాంతి తీసుకుంటున్నా వారి వద్దకే వెళ్లి పింఛన్ అందజేసి వలంటీర్లు సంతోషం పంచుతుండడం గమనార్హం.

నాడు అరకొరగా.. నేడు భారీగా..

చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 5 ఏళ్ల పాటు పింఛన్ మొత్తాన్ని రూ.1,000 మాత్రమే ఇచ్చారు. సరిగ్గా ఎన్నికలకు నెల రోజుల ముందు ఓటర్లకు గాలం వేసేందుకు రూ.2 వేలకు పెంచారు. అప్పటికి జిల్లాలో కేవలం 2,40,843 మంది పెన్షన్‌దారులు మాత్రమే ఉండేవారు. కానీ నేడు పెన్షన్‌దారులు 2,67,516కు చేరుకున్నారంటే వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతగా పెంచారో అర్థం చేసుకోవచ్చు. వచ్చే నెలలో కొత్తగా 6,176 మంది పింఛన్లు అందుకోనున్నారు. లబ్ధిదారులకు డబ్బు అందజేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఆగస్టు నెలలో పింఛన్ల కోసం జిల్లాలో రూ.72 కోట్ల మేర ఖర్చు చేయగా, సెప్టెంబర్‌లో ఆ మొత్తం రూ.74 కోట్లకు పైగా చేరుకుంటుందని తెలిపారు. వీటికి సంబంధించి పింఛన్ పుస్తకాలు ఇప్పటికే ముద్రితమయ్యాయి.



కొత్త పెన్షన్ పుస్తకం

ఎప్పటికప్పుడు అర్హుల గుర్తింపు



ఒక నెలలో అర్హులను గుర్తించి వదిలేయకుండా ప్రతి నెలా గుర్తించి సంతృప్త స్థాయిలో వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తున్నాం. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. పెన్షన్ తీసుకోగానే ఫోన్ చేసి మరీ కృతజ్ఞతలు చెబుతున్నారు. ఈ విషయం మాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

ధర్మవరం అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్‌ఖయ్యూమ్ తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం వారు మాట్లాడుతూ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభించనున్నామని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసి ఆసక్తి ఉన్న యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9182288465 నంబర్, లేదా పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

గుండెపోటుతో తహసీల్దార్ మృతి



ధర్మవరం: పట్టణానికి చెందిన తహసీల్దార్ భాస్కర్‌నారాయణ (58) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక సుందరయ్యనగర్‌లో భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు, కుమార్తెతో కలిసి ఆయన నివసిస్తున్నారు. బుధవారం ఉదయం ఆకస్మాత్తుగా గుండెపోటుతో ఇంట్లోనే కన్నుమూశారు. భాస్కర్‌నారాయణ మృతికి పలువురు పట్టణ ప్రముఖులు, ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు. కాగా, భాస్కర్‌నారాయణ మొదట ఓ ప్రైవేటు ట్యుటోరియల్ నిర్వహిస్తూ వందలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారు. ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో ఆర్‌ఐ, తహసీల్దార్‌గా పనిచేశారు. నాలుగు నెలల క్రితం వరకూ పుట్టపర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.

నేరస్తులకు శిక్ష పడాల్సిందే

- డీఐజీ అమ్మిరెడ్డి



మాట్లాడుతున్న అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి

పుట్టపర్తి టౌన్: కేసులను త్వరగా విచారించి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. బుధవారం పుట్టపర్తి పట్టణంలోని సాయిఆరామంలో ఎస్పీ మాధవరెడ్డితో కలిసి జిల్లా పోలీసు అధికారులతో ఆయన నెలవారీ సమీక్ష నిర్వహించారు. డివిజన్ల వారీగా కేసులపై ఆరా తీశారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హత్య కేసుల్లో త్వరితగతిన పురోగతి సాధించాలన్నారు. రౌడీషీటర్లు, కిరాయి హంతకులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రాత్రివేళ బీటర్లు సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని ముందుసాగాలని సూచించారు. నేరస్తులు ఎంతటి వారైనా శిక్ష పడేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. కోర్టు తీర్పులపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. రౌడీషీటర్ల తీరు మారకపోతే నగర బహిష్కరణ, పీడీ యాక్ట్ ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నల్లమాడ చిన్నారి ప్రవంతికి అండగా నిలిచి ఎస్పీ మాధవ రెడ్డి ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిదర్శనంగా నిలిచారని, ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. నిత్యం ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఎస్పీ మాధవ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మట్కా, ఎర్రచందనం కేసులను ప్రాధాన్యతగా గుర్తించి, అక్రమ రవాణాను కట్టడి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఎస్‌డీపీఓలు, సీఐ, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పోలీసు అధికారులు

పోలీసే దొంగ!



వీడిన 'దారి దోపిడీ' మిస్టరీ

- ఆ రోజు 2 కార్లలో రూ.3 కోట్ల నగదు తరలింపు
- ఒక కారు ముందుకు వెళ్లిపోగా.. వెనుక కారులో దోపిడీ
- డ్రైవర్ సమాచారంతో పక్కాగా స్కెచ్ వేసిన ఇద్దరు కానిస్టేబుళ్లు
- చాకచక్యంగా రూ.2 కోట్ల నగదు బ్యాగుతో పరారీ
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జాతీయ రహదారిలో సినీ ఫక్కీలో జరిగిన రూ.2 కోట్ల దారి దోపిడీ కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. దోపిడీకి పథకం వేసింది ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లని గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... ఈనెల 22న ఎస్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన రూ.3 కోట్ల నగదును కొందరు రెండు కార్లలో తీసుకుని బెంగళూరు నుంచి హైదరాబాదు బయలు దేరారు. రూ.కోటి నగదు బ్యాగుతో వెళ్తున్న కారు డ్రైవరు.. కడపకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్‌కు మరొక కారులో తీసుకొస్తున్న రూ.2 కోట్ల నగదు తరలింపుపై సమాచారం చేరవేశాడు. ఎలాగైనా ఆ సొమ్మును దోపిడీ చేయాలని సదరు కానిస్టేబుల్ పథకం వేశాడు. మరో ఇద్దరు వ్యక్తుల(ఒక కానిస్టేబుల్, మరొక వ్యక్తి)తో కలసి పోలీసు దుస్తుల్లో జాతీయ రహదారి–44లోని గార్లదిన్నె మండలం కలగాసిపల్లి వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచే వాహనాల సమాచారం గురించి రూ.కోటితో వస్తున్న కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వచ్చాడు. అప్పటి వరకు వెనుకగా వస్తున్న సదరు డ్రైవర్ గార్లదిన్నె సమీపంలో రూ.2 కోట్లతో వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేసేశాడు. కలగాసిపల్లి వద్ద మాటు వేసిన కానిస్టేబుల్ అండ్‌కోకు సంకేతాలు పంపాడు. నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకున్న మరొక కారును ఆపి.. తమకందిన సమాచారం, ఆనవాళ్ల ఆధారంగా కారు డిక్కీలో నగదు ఉంచిన బ్యాగును లాగేసుకున్నారు. ప్రశ్నించబోయిన కారులోని వ్యక్తులపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు తమ ముందు వెళ్లిపోయిన రూ.కోటి కారులోని వ్యక్తులకు జరిగిన విషయం తెలియజేశారు. అనంతరం గార్లదిన్నె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీసీ ఫుటేజీతో దర్యాప్తు ముందుకు..

రూ.2 కోట్ల నగదుతో ఉడాయించిన వ్యక్తులు ఇన్నోవా వాహనంలో అనంతపురం వచ్చారు. దోపిడీ చేసే కొన్ని గంటల ముందు అనంతపురం వద్ద వాహనం నంబరు ప్లేట్‌కు స్టిక్కర్ అతికించారు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీలో పోలీసులు పసిగట్టారు. దీంతో చోరీకి తెగబడింది వీరేనన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. స్టిక్కర్ అతికించిన వ్యక్తి జంగిల్ షూ, జంగిల్ ప్యాంట్ ధరించి ఉండటంతో వైఎస్సార్ జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్‌గా గుర్తించారు. అనంతరం అతని మొబైల్‌కు వచ్చిన కాల్ డిటైల్స్ పరిశీలించగా.. ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీకి చెందిన ఓ డ్రైవరు నంబరుతో ఎక్కువగా సంభాషించినట్లు తెలిసింది.

కాల్ డీటైల్స్‌తో దొరికిపోయిన డ్రైవర్..

బెంగళూరు నుంచి రూ.3 కోట్ల నగదుతో హైదరాబాద్‌కు వెళ్తున్న విషయాన్ని ఎస్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిర్వాహకులు దాచిపెట్టారు. దోపిడీకి గురైన రూ.2 కోట్ల గురించి మాత్రమే పోలీసులకు చెప్పారు. మరో రూ.కోటి ముందు వెళ్లిన కారులో తరలించారని దర్యాప్తులో తేలింది. రూ.కోటిని సురక్షితంగా తీసుకెళ్లిన కారు డ్రైవర్‌ను ఆరా తీయగా... ప్రస్తుతం తాను కళ్లకలక వల్ల డ్యూటీకి వెళ్లడం లేదని బుకాయించాడు. అయితే అతడి సెల్‌ఫోన్ నుంచి వైఎస్సార్ జిల్లా ఏఆర్ కానిస్టేబుల్‌కు కాల్స్ వెళ్లినట్లు తేలడంతో.. అతడిని అదుపులోకి తీసుకున్నాడు. దోపిడీలో పాలుపంచుకున్న మరొక కానిస్టేబుల్, ఇంకొక నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. దోపిడీ అయిన సొమ్ములో కొంతమేర మాత్రమే రికవరీ చేసినట్లు సమాచారం. నిందితుల అరెస్ట్‌కు పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

కమ్ముకున్న కరువు మేఘం

- వేరుశనగ సాగుకు సమయం లేదంటున్న శాస్త్రవేత్తలు
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం ఏర్పాట్లు
- 25 వేల క్వింటాళ్ల ఉలవ, పెసలు, అలసంద విత్తనం సిద్ధం
- నేడు కదిరిలో ఖరీఫ్ పంటలపై జిల్లా స్థాయి సమావేశం



పుట్టపర్తి మండలం కప్పలబండ వద్ద ఎండుముఖం పట్టిన వేరుశనగ

కదిరి: వరుణ దేవుడు మొహం చాటేశాడు. ఆయన కరుణ కోసం అన్నదాత ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నాడు. వర్షాభావం కారణంగా ఖరీఫ్‌లో అంతో ఇంతో సాగు చేసిన వేరుశనగతో పాటు ఇతర పంటలు కూడా ఇప్పటికే ఎండుముఖం పట్టాయి. ఖరీఫ్ పంటల సాగుపై గురువారం (నేడు) కదిరి వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం జరగనుంది.

30 శాతమే సాగు..

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 2.84 లక్షల హెక్టార్లు కాగా, ఇప్పటి దాకా కేవలం 84 వేల హెక్టార్లలో (30 శాతం) మాత్రమే సాగు చేశారు. ఇంకా 2 లక్షల హెక్టార్లు సాగు చేయాల్సి ఉంది. జిల్లాలో ఖరీఫ్‌లో ప్రధానంగా సాగు చేసే వేరుశనగ పంట కూడా ఈసారి చాలా తక్కువ విస్తీర్ణంలో సాగైంది. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2.05 లక్షల హెక్టార్లు కాగా అందులో కేవలం 64 వేల హెక్టార్లు (30 శాతం) మాత్రమే ఇప్పటి దాకా సాగు చేశారు. కంది, మొక్కజొన్న, రాగి, ఉలవ, సజ్జ పంటలు 79 వేల హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా అవి కూడా కేవలం 20 వేల హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. వేరుశనగ సాగు చేసేందుకు అదును దాటిపోయిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కంది సాగు చేయడానికి కూడా ఈ నెలాఖరుతో గడువు ముగుస్తుందని సూచిస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటలే ముద్దు..

వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగతో పాటు కంది, ఆముదం పంటల సాగుకు సమయం దాటి పోయింది. ఇప్పుడు వర్షం పడితే పెసలు, ఉలవ, అలసంద, జొన్న పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వాటి సాగుకు ఖర్చుతో పాటు పంట కాల పరిమితీ తక్కువేనని చెబుతున్నారు.

ప్రభుత్వం ముందు చూపు..

ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు తగిన సహాయ సహకారాలు అందించేందుకు జగన్ ప్రభుత్వం ముందు చూపుతో చర్యలు తీసుకుంది. రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాన్ని పంపిణీ చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేసింది. జిల్లాకు 22 వేల క్వింటాళ్ల ఉలవలు, 1,800 క్వింటాళ్ల పెసలు, 900 క్వింటాళ్ల అలసందతో పాటు మరో 75 క్వింటాళ్ల జొన్న విత్తనాన్ని జిల్లాకు పంపింది.

ఖరీఫ్‌లో వర్షపాతం వివరాలు:

నెల	సాధారణ వర్షపాతం	కురిసింది
జూన్	67 మి.మీ	27 మి.మీ
జూలై	62 మి.మీ	42 మి.మీ
ఆగస్టు	50 మి.మీ	11 మి.మీ

80 శాతం సబ్సిడీ



వేరుశనగ సాగుకు సమయం దాటి పోయినందున ప్రభుత్వం 25 వేల క్వింటాళ్ల పెసలు, ఉలవ, అలసంద, జొన్న విత్తనాన్ని ఆర్‌బీకేలకు పంపింది. 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తాం. వర్షం పడితే గానీ వాటిని కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకు రారు. అప్పుడు డిమాండ్ పెరుగుతుంది.

– డాక్టర్ వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి


పంట ఎండింది



ప్రభుత్వం మంచి ఆలోచనతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనం పంపిణీకి సిద్ధం చేసింది. కాకపోతే వాటిని కొనాలన్నా వాన రావాలి కదా.? ముందే కొంటే పురుగు పట్టి విత్తనం పాడైపోతుంది. అందుకే రైతులు ముందుకు రావడం లేదు. సాగుచేసిన వేరుశనగ కూడా ఎండలకు పూర్తిగా ఎండిపోయింది.

– సుధాకర్‌రెడ్డి, రైతు, శిద్దుగూరుపల్లి, తలుపుల మండలం

తక్కువ వర్షపాతం నమోదు



ఈసారి ఖరీఫ్‌లో చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్‌లో 60 శాతం, జూలైలో 30, ఆగస్టులో 80 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇంత తక్కువ విస్తీర్ణంలో గతంలో ఎన్నడూ వేరుశనగ పంట సాగు కాలేదు. ఇప్పుడు 25 మి.మీ వర్షం పడినా ఉలవ, అలసంద, పెసలు సాగు చేసుకోవచ్చు.

– డాక్టర్ సంపత్‌కుమార్, ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త

క్లుప్తంగా

ఘనంగా శ్రీవారి గరుడోత్సవం



గరుడ వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం గరుడోత్సవాన్ని నిర్వహించారు. గరుడ వాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు, డైరెక్టర్లు పర్యవేక్షించారు. గోదా రంగనాథ మహిళా సంఘం సభ్యులు కోలాటం ఆడుతూ ఆకట్టుకున్నారు. అలాగే పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న రమణ మహర్షి ఆశ్రమంలో అరుణాచల శివ నామస్మరణతో భక్తులు పూజలు చేశారు. అనంతరం మహా పరిపూర్ణ శాంతి యాగం నిర్వహించారు.


ఆంధ్రా సరిహద్దుకు తుంగభద్ర జలాలు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి విడుదల చేసిన నీరు బుధవారం రాత్రి 7 గంటలకు ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్దకు చేరింది. గత శనివారం రాత్రి బళ్లారి జిల్లా కొళగల్లు సమీపంలోని 78వ కిలోమీటరు వద్ద హెచ్చెల్సీ కుడి కాలువకు గండి పడి 15 మీటర్లు వరకు తెగిపోయిన విషయం తెలిసిందే. నీరు బంద్ చేసి గండి పూడ్చివేశారు. మంగళవారం తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయడంతో బుధవారం రాత్రి ఆంధ్రా సరిహద్దులోని రెగ్యులేటర్ వద్దకు చేరింది. ప్రస్తుతం హెచ్చెల్సీలో 1,000 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

- రైతుకు లాభాదాయకంగా రాగి పంట
- పంట సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- గతం కంటే రెట్టింపు విస్తీర్ణంలో పంట సాగు
- క్వింటా రాగికి రూ.3,846 ప్రభుత్వ మద్దతు ధర



సాగు చేసిన రాగి పంట

మడకశిర రూరల్: సంపూర్ణ ఆరోగ్యం అందించే చిరుధాన్యాల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులోనూ పెట్టుబడి తక్కువ.. అధిక ఆదాయాన్ని అందించే రాగి పంట సాగు గతంలో ఎన్నడూ లేనంతగా చేపట్టారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకూ మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు మండలాల్లో 2,033 హెక్టార్లలో రాగి పంట సాగులోకి వచ్చింది.

మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ..

రాగి పంట సాగుకు పెట్టుబడులు సైతం చాలా తక్కువ. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆహార దినుసు కావడంతో పంట సాగు చేసిన రైతులకు ఆదాయం ఎక్కువగానే ఉంటోంది. అంతేకాక ఈ పంటకు తెగుళ్లు కూడా ఎక్కువగా ఆశించవు. తక్కువ నీటి వనరులతోనే సాగు చేపట్టవచ్చు. విత్తు వేసిన మూడు నెలల్లోపు పంట చేతికి అందుతుంది. ఎకరా విస్తీర్ణంలో పంట సాగు, కలుపు ఏరివేత, ఎరువులకు కలిపి రూ.15వేలు ఖర్చు కాగా, పంట కాలం పూర్తి కాగానే ఎకరాకు 10 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఖర్చులు పోను ఎకరాకు దాదాపు రూ.25 వేల వరకు రైతుకు ఆదాయం సమకూరుతుంది.

సర్కార్ ప్రత్యేక ప్రోత్సాహం..

రాగి పంట సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది. క్వింటా రాగికి రూ.3,846 మద్దతు ధర ప్రకటించింది. పంట ఉత్పత్తులను స్థానిక రైతు భరోసా కేంద్రాల్లోనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది. అంతేకాక ఆర్బీకేల ద్వారా సబ్సిడీతో విత్తనాలు అందజేసింది. పంట సాగుపై రైతుల్లో విస్తృత చైతన్యం తీసుకురావడంతో గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఖరీఫ్‌లో ఒక్క మడకశిర నియోజకవర్గంలోనే 2,033 హెక్టార్లలో రాగి పంట సాగులోకి వచ్చింది.

రాగిలో ఆరోగ్య ప్రయోజనాలు..

రాగిలో కొలెస్ట్రాల్, సోడియం పెద్దగా ఉండవు. కొవ్వు (ఫాట్) 7 శాతం మాత్రమే ఉంటుంది. రాగుల్లో కొలెస్ట్రాల్, సోడియం లేకుండా. ఐరన్, మెగ్నీషియం, ఫైబర్ పోషకాలు, కాల్షియం, విటమిన్లు, ప్రోటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్లు లాంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిని రోజూ ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించడంతో పాటు.. అధిక బరువు సమస్య నివారణ అవుతుంది. రాగులు తినడం ద్వారా కొలెస్ట్రాల్, బీపీ నియంత్రణలో ఉంటుంది. ఫలితంగా గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఎముకలు దృఢంగా మారుతాయి. బోలు ఎముకల వ్యాధి తీవ్రత తగ్గుతుంది. రక్త హీనత సమస్య తలెత్తదు.

నియోజకవర్గంలో సాగులో ఉన్న రాగి పంట	
మండలం	సాగు విస్తీర్ణం
మడకశిర	173 హెక్టార్లు
అగళి	692 హెక్టార్లు
రొళ్ల	350 హెక్టార్లు
అమరాపురం	125 హెక్టార్లు
గుడిబండ	800 హెక్టార్లు

మూడు ఎకరాల్లో రాగి

(29ఎండీకేఎస్102సీ)



ఈ ఏడాది మూడు ఎకరాల్లో రాగి పంట వేశా. పైరు వేయడం మొదలు కలుపు తీత, ఎరువులకు ఇతర ఖర్చులు అన్ని కలిపి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టాను. గతంలో నేను రాగి పంట సాగు చేసినప్పుడు ఎకరాకు 10 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఈ ఏడాది కూడా అదే స్థాయిలో దిగుబడి వస్తే పెట్టుబడులు పోను ఎకరాకు రూ.25 వేలకు పైగా ఆదాయం మిగులుతుంది.

– నాగిరెడ్డి, రైతు, ఉప్పిడిపల్లి, మడకశిర మండలం

రాగి సాగు విస్తీర్ణం పెరిగింది



మడకశిర వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో బోరు బావుల కింద ఈ ఖరీఫ్‌లో రాగి సాగు విస్తీర్ణంగా గణనీయంగా పెరిగింది. ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకూ దాదాపు 2,033 హెక్టార్లలో రైతులు రాగి పంట సాగు చేశారు. ప్రభుత్వం కూడా రాగి పంట సాగును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది.

– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

బాబర్‌కు పీకేఎం వైస్ చైర్మన్ పదవి



ఎం.బాబర్

కదిరి: పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం) వైస్ చైర్మన్‌గా ఎం.బాబర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. బాబర్ ప్రస్తుతం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా ఉంటూ ఈ మధ్యే అసిస్టెంట్ సెక్రెటరీగా పదోన్నతి పొందారు. చిత్తూరు జిల్లా సదుంకు చెందిన బాబర్... సెకండ్ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఓడి చెరువు మండలం వీరఓబునపల్లిలో చాలా కాలం టీచర్‌గా పని చేశారు. స్థానిక మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్‌ను వివాహం చేసుకొని కదిరిలోనే కాపురం ఉండేవారు. అనంతరం గ్రూప్-2కు ఎంపికై న బాబర్ ఆ తర్వాత కదిరి మున్సిపల్ కమిషనర్‌గా, ఆ తర్వాత జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా పనిచేశారు. అనంతరం బదిలీపై ఏపీపీఎస్సీకి వెళ్లారు. ప్రస్తుతం పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ (పీకేఎం) అథారిటీ వైస్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు.

'స్కోచ్' అవార్డుకు జీఆర్పీ ఎంపిక



విలేకరులతో మాట్లాడుతున్న జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డుకు గుంతకల్లు రైల్వే జిల్లా గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఎంపికైంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం రాత్రి జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. నేరాల నియంత్రణ కోసం సస్పెక్ట్ మానిటరింగ్ సిస్టం (ఎస్ఎంఎస్) యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రైళ్లు, ప్లాట్ ఫామ్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానిత వ్యక్తుల నుంచి ఎస్ఎంఎస్ యాప్ ద్వారా వేలిముద్రలు తీసుకుంటామన్నారు. దీంతో వారి నేర చరిత్ర బయటపడుతుందన్నారు. అంతే కాకుండా ప్రయాణికుల భద్రత, వారి ఆస్తుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీ ఆదేశాలతో దాదాపు 104 మంది అదనపు సిబ్బందిని నియమించారు. దీంతో రాత్రింబగళ్లు రైళ్లల్లో గస్తీ నిర్వహించి దొంగతనాలు అదుపు చేయగలిగామన్నారు. ఈ ఏడాది రూ.1.70 కోట్లు ప్రయాణికుల నుంచి దొంగిలించగా.. అందులో రూ. 80 లక్షల మేర రికవరీ చేశామన్నారు. దీంతో గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా రైళ్లలో చోరీలు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుంతకల్లు రైల్వే జిల్లా జీఆర్పీ పోలీసులు చూపిన ప్రతిభకు గుర్తింపుగా 'స్కోచ్' అవార్డుకు ఎంపిక చేశారన్నారు. త్వరలోనే అవార్డు అందజేస్తారన్నారు.

నిబంధనలకనుగుణంగా విధులు

- జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనలకనుగుణంగా విధులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ చేతన్ తెలిపారు.

బుధవారం కలెక్టరేట్‌లో అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన వారి వివరాలు, వలసదారుల క్లెయింలను ఆగస్టు 9 వరకూ రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు చెప్పారు. తొలగించిన ఓట్లను మరోసారి ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలు ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి, మౌలిక వసతులు ఉన్నాయా లేదా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రీ వెరిఫికేషన్ కోసం నియోజకవర్గానికి ఒక అధికారిని నియమించినట్లు తెలిపారు. ఓటరు కార్డుతో ఆధార్‌ను అనుసంధానించాలని, రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే తొలగించాలని, వృద్ధాశ్రమాల్లో ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలని అఖిల పక్ష నాయకులు కోరగా, తప్పకుండా సమస్యలను పరిష్కరిస్తామని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్, ఎన్నికల డీటీ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్లు సద్వినియోగం చేసుకోండి

ప్రాసెసింగ్ యూనిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయాధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం, జిల్లా కరువు నివారణ పథకం కింద కనగానపల్లి, తలుపుల, తనకల్లు, రామగిరి, అగళి, రొద్దం, మడకశిర మండలాల పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 28 చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరయ్యాయన్నారు. యూనిట్లకు 50 శాతం రాయితీ, రూ.2 లక్షలకు మించకుండా అందిస్తారన్నారు. ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, ఆయా మండలాల రైతులు పాల్గొన్నారు.

పెనుకొండ ఆస్పత్రిలో నల్లనాగు కలకలం

- పట్టుకోబోయిన యువకుడిని కాటేసిన వైనం
- ప్రాణాపాయ స్థితిలో బాధితుడు
- అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స



ట్రామా కేర్ సెంటర్‌లోకి చొరబడ్డ నల్లనాగు

పెనుకొండ: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నల్లనాగు కలకలం సృష్టించింది. బుధవారం 9 గంటలకు ట్రామా కేర్ సెంటర్‌లో విధులకు హాజరైన సూపర్‌వైజర్ శ్రీనివాసులు.. అక్కడి డిప్యూటీ డీఎం హెచ్ఓ చాంబర్‌లో శబ్దం రావడంతో అటుగా వెళ్లి చూశారు. లోపల పడగ విప్పిన నల్లనాగు కనిపించడంతో భయంతో ఎటూ కదల్లేకుండా ఉండిపోయాడు. కాసేపటి తర్వాత తేరుకుని తోటి ఉద్యోగులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేయడంతో సిబ్బంది, ప్రజలు ట్రామాకేర్ సెంటర్‌కు వద్దకు భారీగా చేరుకున్నారు. కొందరు పాలు తీసుకువచ్చి పాము సమీపంలో ఉంచారు. మరికొందరు పాముకు దండాలు పెట్టారు. దీంతో పాము ఎటూ వెళ్లలేక అక్కడే పడగ విప్పి నిలబడిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక రామమందిరం ప్రాంతానికి చెందిన యువకుడు రాజు అక్కడకు చేరుకుని పామును పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో పాము కాటు వేసింది. అయినా ఆ యువకుడు పామును పట్టుకుని ఆస్పత్రి వెనుక పొదల్లోకి వదిలాడు. అనంతరం రాజుకు అక్కడే ఉన్న వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తరలించారు. విష ప్రభావం ఎక్కువగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై రాజుకు అనంతపురం వైద్యులు చికిత్స చేస్తున్నారు.

హిందూపురం వన్‌టౌన్ సీఐగా శ్రీనివాస్

- రూరల్ సీఐగా శ్రీరామ్ శ్రీనివాస్

హిందూపురం అర్బన్: హిందూపురం వన్‌టౌన్ సీఐగా వి. శ్రీనివాస్, రూరల్ సీఐగా శ్రీరామ్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ హిందూపురం రూరల్ సీఐగా ఉన్న వేణుగోపాల్, వన్‌టౌన్ సీఐగా ఉన్న ఈరన్నను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు.

యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి: ప్రియురాలికి పెళ్లి నిశ్చయం కావడంతో జీర్ణించుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం జూలకుంట గ్రామానికి చెందిన సుధాకరరెడ్డి కుమారుడు మధుసూదన్‌రెడ్డి (24) హిందూపురంలోని ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా తాను ప్రేమిస్తున్న యువతికి ఇటీవల మరో యువకుడితో వివాహం నిశ్చయమైంది. ఈ విషయం తెలుసుకున్న మధుసూదన్‌రెడ్డి బుధవారం ఉదయం షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కడుపునొప్పి తాళలేక తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


'ఆ'జాదూపై విచారణ ప్రారంభం



రొళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టిన డీఎల్‌డీఓ శివారెడ్డి

అనంతపురం సిటీ/రొళ్ల: అనేక ఆరోపణలు, విమర్శలకు కేంద్ర బిందువైన శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండల పరిషత్ అధికారి ఆజాద్‌పై విచారణ మొదలైంది. విచారణాధికారిగా నియమితులైన ధర్మవరం డీఎల్‌డీఓ శివారెడ్డి బుధవారం రొళ్లకు చేరుకుని మండల పరిషత్ సిబ్బందితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను వేర్వేరుగా విచారణ చేశారు. ప్రభుత్వ కార్యాలయాన్నే బార్‌గా మార్చి మద్యం తాగడం, మహిళా చిరుద్యోగులతో అసభ్యంగా ప్రవర్తించడం తదితర అక్రమాలను ఇటీవల జెడ్పీ సమావేశంలో ఆ మండల జెడ్పీటీసీ సభ్యురాలు ఏకరవు పెట్టారు. అంతేకాక జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ల చేతన్‌తో పాటు జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్‌ను లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ అంశానికి సంబంధించి 'ఆ'జాదూ ఎంపీడీఓ మాకొద్దు', 'ఆ'జాదూపై సమగ్ర విచారణ' శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీంతో ఆజాద్ అక్రమాలపై విచారణాధికారిగా డీఎల్‌డీఓ శివారెడ్డిని ఉన్నతాధికారులు నియమించిన విషయం తెలిసిందే. కాగా, తనపై విచారణ జరుగుతున్న సమయంలో పక్కదారి పట్టించేందుకు ఎంపీడీఓ ఆజాద్ విశ్వ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. దాదాపు 30 మంది ప్రైవేట్ వ్యక్తులను కార్యాలయానికి రప్పించుకుని విచారాణాధికారిని ప్రభావితం చేసేలా ప్రయత్నించడం దుమారం రేపింది. దీంతో మరోసారి జెడ్పీటీసీ సభ్యురాలు నేరుగా ఫోన్ ద్వారా విషయాన్ని జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్ గార్గ్‌కు వివరించారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి



మృతుడు స్మృతిరంజన్ స్వైన్

నల్లచెరువు: బతుకు తెరువు కోసం ఒడిశా నుంచి వలస వచ్చిన కూలీ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఒడిశాకు చెందిన స్మృతిరంజన్ స్వైన్ (33) 20 రోజుల క్రితం నల్లచెరువు మండలం కాలేపల్లికి చేరుకుని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల్లో పాల్గొంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున తమకు కేటాయించిన షెడ్డుకు సమీపంలో ఉన్న పొలాల్లోకి వెళ్లాడు. అయితే అడవి జంతువులను వేటాడేందుకు వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను గమనించకుండా కాలు పెట్టడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ షెక్షావలి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు

- ముగిసిన వెబ్ కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న పరిపాలనాధికారులు(ఏఓలు), ఈఓఆర్‌డీలకు పదోన్నతులు లభించాయి. పలువురికి ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం ఆ శాఖ ఉన్నతాధికారులు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో నలుగురు ఈఓఆర్‌డీలు, ఇద్దరు ఏఓలకు ఎంపీడీఓలుగా అవకాశం దక్కింది. వారికి జిల్లాలు సైతం కేటాయించారు.

పదోన్నతి పొందిన వారి వివరాలు ఇలా..		
అధికారి	ప్రస్తుత హోదా, ప్రదేశం	బదిలీ ప్రదేశం
బారాన్ సాహెబ్	ఈఓఆర్‌డీ, గుంతకల్లు	అన్నమయ్య జిల్లా
లక్ష్మీనరసింహ	ఈఓఆర్‌డీ, నార్పల	అన్నమయ్య జిల్లా
పోలప్ప	మండల పరిషత్ ఏఓ, కొత్తచెరువు	అన్నమయ్య జిల్లా
రవికుమార్	ఏఓ, జెడ్పీ, అనంతపురం	వైఎస్సార్ జిల్లా
ఖాదర్‌బాషా	ఈఓఆర్‌డీ, ముదిగుబ్బ	చిత్తూరు జిల్లా
సుహాసిని	ఈఓఆర్‌డీ, చిలమత్తూరు	కర్నూలు జిల్లా

ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

అనంతపురం సిటీ: ప్రమాదవశాత్తు ఓ యువకుడు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ విజయ కుమార్ తెలిపిన మేరకు.. అనంతపురంలోని నీరుగంటి వీధికి చెందిన సాయికిరణ్(24) తన భార్య దివ్యశ్రీతో కలసి బెంగళూరులో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే భార్యతో కలసి మంగళవారం రాత్రి అనంతపురానికి రైలులో బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు రైలు అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుండగా.. భార్యతో పాటు లగేజ్ తీసుకుని తలుపు వద్దకు చేరుకున్న సాయికిరణ్ అదుపు తప్పి కిందపడ్డాడు. కళ్లేదుటే రైలులో నుంచి భర్త జారి పడుతుండగా దివ్యశ్రీ పట్టుకునే ప్రయత్నం చేసింది. అయినా ఫలితం లేకపోయింది. రైలు చక్రాల కింద పడి సాయికిరణ్ దేహం ముక్కలైంది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి దుర్మరణం

చిలమత్తూరు/అమడగూరు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు..

- పావగడ తాలూకా రాయలచెరువుకు చెందిన శివయ్య (29) గోరంట్లలో బంధువుల గృహ ప్రవేశానికి హాజరయ్యాడు. అనంతరం బుధవారం ఉదయం స్కూటీపై బెంగళూరుకు వెళుతూ చిలమత్తూరు మండలం కోడూరు మర్రో తోపు నుంచి 44వ జాతీయ రహదారిపైకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఘటనలో మొండెం నుంచి తల వేరైంది. దాదాపు వంద మీటర్లకు పైగా ద్విచక్రవాహనంపై మొండెం అలాగే దూసుకెళ్లి పడింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.
- అనారోగ్యంతో బాధపడుతున్న అమడగూరు మండలం జౌకలకొత్తపల్లికి చెందిన సాయిలీల (35).. బుధవారం చికిత్స నిమిత్తం తన తమ్ముడు మంజునాథ్‌తో కలసి బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై అనంతపురంలోని ఆస్పత్రికి బయలుదేరారు. తొట్లివారిపల్లి సమీపంలోకి చేరుకోగానే రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్క తప్పించబోవడంతో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. సాయిలీల తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై ఎస్ఐ గోపి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బేల్దారిపై టీడీపీ నేతల దాడి



గాయపడిన నాగేంద్ర

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి గ్రామానికి చెందిన దళితుడు నాగేంద్రపై టీడీపీ నేతలు దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న నాగేంద్ర.. చింతలయ్యగారిపల్లిలో లేబర్ కాంట్రాక్ట్ కింద తన బంధువు ఓబులేసు ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. అదే కట్టడంలో చింతలయ్యగారిపల్లికి చెందిన టీడీపీ నేత గుల్లోల్ల సల్లప్పగారి ఓబిరెడ్డి కుమారుడు కాటమయ్య, మరికొందరు పెయింటింగ్ పనులు చేస్తున్నారు. పనిలో నాణ్యత లోపించడంతో కూలి పెండింగ్‌లో పెట్టారు. ఈ విషయంగా మంగళవారం రాత్రి నాగేంద్ర బస్టాండ్ వద్ద వేచి ఉండగా పెయింటర్ కాటమయ్య అక్కడకు చేరుకుని కూలి డబ్బులు రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. పని సక్రమంగా చేయలేదు కాబట్టి డబ్బులు ఇవ్వనని నాగేంద్ర బదులివ్వడంతో కులం పేరుతో దూషిస్తూ చెప్పుతో దాడికి తెగబడ్డాడు. అనంతరం మొహంపై పిడి గుద్దులు గుద్దాడు. దీంతో నాగేంద్ర ఎడమ కన్నుకు బలమైన గాయమైంది. దాడిని గమనించి అడ్డుకోబోయిన నాగేంద్ర అన్న గంగన్నపై బోయగడ్డ జయరామ్, కాటమయ్య, జయరామ్ కుమారులు ఆనంద్ కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషణలకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.